క్లుప్తంగా

గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు



గౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు బాపూజీ కాలనీలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గౌరీ పరమేశ్వరులను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నర్సింహపాత్రుడు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దొడ్డి రమణ, మద్దాల అప్పారావు, పిల్లా కన్నబాబు, ఆడారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ పార్కింగ్ చేసే ఆటోలకు వీల్ లాక్



ఆటోలకు వీల్ లాక్ వేయిస్తున్న ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: ఆటోల రాంగ్‌పార్కింగ్‌కు కళ్లెం వేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు గాజువాక పోలీసులు. ఆటోలు కదిలే వీల్లేకుండా చక్రాలకు లాక్ వేసేస్తున్నారు. పాతగాజువాక జంక్షన్‌లో ఆటోవాలాలు విచ్చలవిడిగా, నిబంధనలకు విరుద్ధంగా రాంగ్ పార్కింగ్ చేస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగజేస్తున్నారు. దీనిపై సీరియస్‌గా స్పందించిన గాజువాక ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్‌ఐ అప్పలనాయుడు గురువారం సిబ్బందితో కలిసి రాంగ్ పార్కింగ్ చేసిన ఆటోలకు వీల్ లాక్ చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

తిరుమల బాలాజీకి తిరుప్పావడ సేవ



తిరుప్పావడ సేవలో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్‌బీఎల్ ప్రాంగణంలో కొలువైయున్న శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో గురువారం తిరుప్పావడ సేవ నిర్వహించారు. పులిహోరను రాశిగా పోసి స్వామికి నివేదించారు. అనంతరం పులిహోర ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

గంగవరంలో కంటి వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పెదగంట్యాడ: అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అదానీ గంగవరం పోర్టు సీఎస్సార్ నిధులతో గంగవరం గ్రామంలో గురువారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పోర్టు ప్రతినిధులు అచ్యుతారావు, నారాయణరావు ప్రారంభించారు. మొత్తం 203 మందికి వైద్య పరీక్షలు చేశారు. అందులో 98 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. వాటిని వారికి ఉచితంగా అందజేస్తామని పోర్టు యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో రమేష్ బాబు, ఎరిపిల్లి దేముడు, నల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇంట సంక్షేమ కాంతులు

- శతశాతం హామీల అమలు
- సీఎం జగన్ పాలనపై సర్వత్రా ప్రశంసలు
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



బుక్‌లెట్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలకు పునాది పడిందని, అవే పేదల ఇంటికి వెలుగులు తెచ్చాయని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 75వ వార్డు నీలాపువీధి సచివాలయం వద్ద నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే ..' కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. సచివాలయ పరిధిలో ప్రజలకు 17కోట్ల 34 లక్షల 67వేల 63 రూపాయలు లబ్ధి చేకూర్చామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను శతశాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి పని చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా దళారులు దోచుకునేవారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దళారులకు చెక్ పెట్టి, సంక్షేమ పథకాల నగదును లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకే జమ చేస్తూ పారదర్శకంగా అమలు చేస్తున్నారన్నారు. పిల్లల చదువుకు అండగా నిలుస్తూ, కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా కోరుతున్నారన్నారు. ఎన్ని పార్టీలు కలసి వచ్చినా, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం తథ్యమన్నారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయ పరిధిలో వివిధ పథకాల కోసం ఖర్చు చేసిన వివరాలను తెలియజేసే డిజిటల్ బోర్డును ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-6 జోనల్ కమిషనర్ సింహాచలం, వైఎస్సార్ సీపీ 75వ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, మార్టుపూడి పరదేశి, కొయ్య భారతి, పిట్టా రెడ్డి, వెంకటేష్, గొందేశి అప్పలరెడ్డి, నాగు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన ప్రజలు

అలరించిన కవి సమ్మేళనం

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



గాజువాక గ్రంథాలయంలో కవులను సత్కరిస్తున్న దృశ్యం



పెదగంట్యాడ గ్రంథాలయంలో డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గాజువాక: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గాజువాక శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన కవి సమ్మేళనం ఆహూతులను అలరించింది. పలువురు కవులు సమకాలీన అంశాలపై చేసిన ప్రసంగాలు, చదివిన కవితలు సభికులను ఆలోచింపజేశాయి. రచయిత, కవి అద్దంకి రాఘవాచార్యులు దేవులపల్లి కృష్ణశాస్త్రి కవితలను చదివి వినిపించారు. అనంతరం కృష్ణశాస్త్రి గొప్పదనాన్ని వివరించారు. రైతుల ఆత్మహత్యలు, బాల కార్మికుల స్థితిగతులపై తుంపాల శ్రీరామ్మూర్తి పలు పద్యాలను వినిపించారు. కవి రాజా గణేషన్ ప్రజల సమస్యలను పద్య రూపంలో వివరించారు. అమ్మ మనసుపై వైదా ఈశ్వరరావు వినిపించిన కవిత అందర్నీ ఆకట్టుకుంది. గ్రంథాలయంలో పుస్తకాలను ఉపయోగించుకోవడం వల్ల లాభాలు, మొబైల్ ఫోన్లను అవసరానికి మించి వాడటం వల్ల కలిగే నష్టాలను వెలగా హరిశ్చంద్రరావు, అడ్వకేట్ రాజు, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు వివరించారు.

కవులకు సత్కారం: గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గ్రంథాలయంలో పలువురు కవులను ఘనంగా సత్కరించారు. కవి సమ్మేళనానికి విచ్చేసిన కవులు, రచయితలను గ్రంథాలయాధికారి చంద్రకళ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పౌర గ్రంథాలయ పరిషత్ సభ్యుడు మహేష్‌బాబు, గ్రంథాలయ అసిస్టెంట్ డైరెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

పెదగంట్యాడ: గ్రంథాలయాలు విజ్ఞాన గనులని మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు అన్నారు. విద్యార్థులు తరచూ వచ్చి, గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం సముపార్జించుకోవాలని సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెదగంట్యాడ శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు గ్రంథాలయ శాఖాధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో గురువారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. డ్రాయింగ్ పోటీల్లో నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్, విశాఖ విమల విద్యాలయం, శరత్ స్కూల్, ప్రతిభ స్కూల్, లైఫ్ వే స్కూల్ విద్యార్థులు 169 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

సమష్టి కృషితో స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి



స్టీల్‌ప్లాంట్ నూతన సీజీఎం స్వామిని సత్కరిస్తున్న యూనియన్ నాయకులు

ఉక్కునగరం: ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సమష్టి కృషితో స్టీల్‌ప్లాంట్‌ను పురోభివృద్ధిలో నడుపుదామని స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఎస్.వి. స్వామి అన్నారు. స్టీల్‌ప్లాంట్ నూతన సీజీఎం (వర్క్స్) ఇన్‌చార్జిగా స్వామి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఉక్కు శ్రామిక సంఘం నాయకులు గురువారం ఆయనను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది త్యాగ ఫలితాలతో ఏర్పడిన ప్లాంట్‌ను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందరూ కష్టపడితే ప్లాంట్ లాభాల బాట పడుతుందన్నారు. అంతకు ముందు నాయకులు మాట్లాడుతూ సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధానకార్యదర్శి బొడ్డు పైడిరాజు, అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి, కరణం సత్యారావు, బొడ్డు రమణ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పూజా సామగ్రి విక్రయాలు



పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు

అక్కిరెడ్డిపాలెం: నాగుల చవితి పండగను పురస్కరించుకుని పూజా సామగ్రి కొనుగోళ్ల విక్రయాలు జోరుగా సాగాయి. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం సర్వీసు రోడ్డు గురువారం కొనుగోలుదారులతో రద్దీగా మారింది. పువ్వులు, బెల్లం, అటుకులు, శనగపప్పు, టవల్స్, కొబ్బరి కాయలు, అరటిపండ్లు, చెరకు, తాటి టెంకలు, తమలపాకులు, అరటి ఆకులు తదితర నాగులచవితి పూజా సామగ్రిని కొనుగోలు చేశారు. శుక్రవారం చవితి పూజకు అంతా సిద్ధం చేసుకున్నారు.

తుంగ్లాం వైపు భెల్ గేటు తెరిపించాలని మంత్రికి వినతి



మంత్రి అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గోవింద రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాం వైపు గల భెల్ (హెచ్‌పీవీపీ) గేటును తెరిపించాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి, గ్రామ నాయకులు కోరారు. మిందిలోని మంత్రి నివాసంలో ఆయన్ను కలిసిన నాయకులు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గేటు సమస్యపై ఎన్నో సంవత్సరాలుగా పోరాడుతున్నామన్నారు. నిత్యం వేలాదిమంది గ్రామం నుంచి భెల్ సిగ్నల్ పాయింట్‌కు కాలినడకన రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. పాఠశాలలకు, బ్యాంకులకు, పోస్టాఫీసులకు వెళ్లేవారితో పాటు ప్రైవేట్ పనులకు వెళ్లే కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గేటును తెరిపిస్తే ఆటోలు, కార్లు, అంబులెన్స్‌లు రాకపోకలు సాగించడానికి సౌలభ్యంగా ఉంటుందని మంత్రికి విన్నవించారు. సమస్యపై సానుకూలంగా స్పందించిన మంత్రి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మోహనరూపా.. జ్యోతి స్వరూపా..



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి



స్టీల్‌ప్లాంట్‌లో పడిపూజకు హాజరైన అయ్యప్ప దీక్షధారులు

- మిన్నంటిన అయ్యప్ప శరణుఘోష
- స్టీల్‌ప్లాంట్ ఆలయంలో వైభవంగా పడిపూజ

ఉక్కునగరం: స్థానిక అయ్యప్పస్వామి దేవాలయం హరిహరసుతుని శరణుఘోషతో మిన్నంటింది. ఆలయంలో పడిపూజా మహోత్సవాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. నవంబర్ 16 నుంచి డిసెంబర్ 27 వరకు నిర్వహించనున్న అయ్యప్ప మండల పూజల్లో భాగంగా మండల దర్శనం ముందు శబరిమలై అయ్యప్ప ఆలయంలో వలే ఇక్కడా పెద్ద ఎత్తున పడిపూజ నిర్వహిస్తుంటారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా రాత్రి దేవాలయాన్ని తెరిచారు. ఆలయం ప్రాంగణంలో ఉన్న ఉపదేవతలు, బలిపీఠాలకు, పరివార దేవతలకు ఆవాహన పూజతో కార్యక్రమం ప్రారంభించారు. గుడి సేవ కార్యక్రమం అనంతరం స్వామి వద్ద జ్యోతిని వెలిగించి కిందికి తీసుకు వెళ్లారు. ఆలయ ప్రధానార్చకులు నాగేశ్వరశర్మ నేతృత్వంలో అష్టాదశ దేవతలకు(18మెట్ల)కు పూజలు చేసి, అయ్యప్ప స్వామికి కర్పూర జ్యోతి వెలిగించారు. మాలధారుల భజనలతో ఆధ్యాత్మిక సౌరభం వెల్లివిరిసింది. డప్పు శ్రీను బృందం గీతాలు అలరించాయి. స్వాములు అయ్యప్ప దర్శనం చేసుకుని చద్దిని స్వీకరించారు.



వెంకన్నపాలెంలో పడిపూజ చేస్తున్న మాలధారులు

వెంకన్నపాలెంలో..

పెదగంట్యాడ: 64వ వార్డు వెంకన్నపాలెంలోని కల్యాణ మండపంలో వెంకన్నపాలెం శబరి పీఠం, గురుస్వామి ధర్మాల శ్రీను ఆధ్వర్యంలో అయ్యప్ప పడి పూజా మహోత్సవాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. పూజల్లో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, చిన్నిపిల్లి ఆనంద్‌రెడ్డి, ధర్మాల వీరుబాబు, బొట్ట అచ్చన్న, మద్ది రాజు తదితరులు పాల్గొన్నారు.

కేవీలో డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ

దొండపర్తి: స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న కేంద్రీయ విద్యాలయ్‌లో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 10, 12 తరగతి డ్రాపవుట్ అయిన నిరుద్యోగులకు పూర్తి వివరాల కోసం శుక్ర, శనివారాల్లో స్కూల్‌లో ఉన్న కంప్యూటర్ ఫ్యాకల్టీని కలవాలని చెప్పారు. కోర్సులో నమోదు కోసం అభ్యర్థులు ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ ఫొటోతో కేంద్రీయ విద్యాలయ్‌లో సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో సాయి చాలీసా పారాయణం



పారాయణం చేస్తున్న మహిళలు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి షిర్డీ సాయిబాబా ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి హారతి, విభూదిపూజ, పంచామృతాభిషేకం జరిపించారు. తరువాత 50 మంది మహిళలు విష్ణు సహస్రనామ స్తోత్రం, లింగాష్టకం, గురుపాదకం, సాయి చాలీసా, ద్వాదశలింగం, మృత్యుంజయ మంత్రం పఠించారు. తరువాత అభిషేకాలు జరిపించి ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటరమణారెడ్డి, డి.వ్యాసశర్మ, పి.రామారావు, పీఎల్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో కార్మికుల భవిష్యత్తు అంధకారం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వల్ల కార్మికుల జీవనోపాధి పోతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ముఖ్యంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో కార్మికులు, ఉక్కు నిర్వాసితుల భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలో 1008వ రోజు గురువారం, సంస్థకు చెందిన బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుంటేనే దేశ భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఎన్నో ఏళ్లుగా కార్మికులు అహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను దేశంలో అగ్రగామిగా నిలిపితే, నేడు ఆ పరిశ్రమను కేంద్రప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్ ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కుల పరిరక్షణకు పోరాడతామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించే వరకు ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'సర్వహిత' పింఛన్ల పంపిణీ



పింఛన్లు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: అగనంపూడికి చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్ పంపిణీ చేశారు. ట్రస్ట్ ప్రతీనెలా 2వందల వంతున 75 మందికి పింఛన్ అందిస్తోంది. ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పింఛన్లతో పాటు రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తి కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందించారు. కార్యక్రమంలో మహాత్మాగాంధీ సేవా సమితి అధ్యక్షుడు చిత్తా రామారావు, ట్రస్ట్ సలహాదారు పట్టా రామ అప్పారావు, చైర్మన్ మస్తాన్‌రెడ్డి, వ్యవస్థాపకుడు గుడే సుశీలా గజేంద్రరావు, వైస్ చైర్మన్ కిడిమి హనుమంతురావు పాల్గొన్నారు.

అగనంపూడి హార్టికల్చర్ సొసైటీ ఎన్నిక ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నికైన అగనంపూడి సొసైటీ కమిటీ

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో అగనంపూడి హార్టికల్చర్ సొసైటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అగనంపూడి కమ్యూనిటీ వెల్ఫేర్‌సెంటర్‌లో నిర్వహించిన ఎన్నికల్లో 15 మంది సభ్యులు నామినేషన్ వేయగా వీరిలో నలుగురు ఉపసంహరించుకోవడంతో మిగిలిన 11 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి బి.శ్రీనివాస్ తెలిపారు. డైరెక్టర్లుగా ఎన్నికైన వారిలో నెల్లి శ్రీనివాసరావు, విందుల ఈశ్వరరావు, మింది కన్నారావు, కాటకోటి అప్పారావు, కడవల తాతారావు, జెర్రిపోతుల కృష్ణ, డీఎస్‌వి నరసింగరావు, దాసరి భూసన్న, సన్యాసిరావు,దుల్ల రామునాయుడు, సాలాపు సన్యాసిరావు ఉన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ ప్రతినిధులు సాలాపు అచ్చిబాబు, మరిశా రామచంద్రరావు,రమణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

గాజువాక: వీడీఏ డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై గాజువాక ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ అప్పలనాయుడు మాట్లాడుతూ నిబంధనలపై అవగాహన లేకపోవడం వల్ల ఒకవైపు ప్రమాదానికి కారణమైన వ్యక్తి, మరోవైపు ప్రమాదానికి గురైన వ్యక్తి కుటుంబాలు బాధ పడాల్సి వస్తోందన్నారు. పరిమిత వేగంతో ప్రయాణించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు బి.శ్రీనివాసరావు, డి.ఎస్.ఎస్.కృష్ణ కుమార్, ప్రిన్సిపాల్ కె.సీతాలక్ష్మి, బి.టి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలోను పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకం



విజేతను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ బలరామకృష్ణ

గాజువాక: ఇందిరాగాంధీ మెమోరియల్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్, శాప్ నిర్వహించిన 7వ ఎలైట్ ఆంధ్రప్రదేశ్ మెన్ అండ్ ఉమెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్-2023 పోటీల్లో స్థానిక టీఎస్సార్, టీబీకే కళాశాల విద్యార్థి జి.మానస స్వర్ణ పతకం సాధించింది. నగరంలో నిర్వహించిన ఈ పోటీల్లో మానస 66-70 కేజీల విభాగంలో ఉత్తమ బాక్సర్‌గా నిలిచింది. ఆమెను కళాశాల దచైర్మన్ టి.బలరామకృష్ణ, ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్ అభినందించారు.

వృత్తి విద్యా కోర్సులకు ఉచిత శిక్షణ

తాటిచెట్లపాలెం: జన శిక్షణ సంస్థాన్,జగద్గురు పీఠం సంయుక్తంగా తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఈకే సంస్కృతి సదన్‌లో పలు వృత్తి విద్యా కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ప్రారంభిస్తున్నట్లు జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 45 ఏళ్ల వయసు గల మహిళలు అర్హులని చెప్పారు. ఈ నెల 22లోగా తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఈకే సంస్కృతి సదన్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల లోపు తమ పేర్లు, వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. కంప్యూటర్ కోర్సు(3 నెలలు), హ్యాండ్ ఎంబ్రాయిడరీ(3 నెలలు), బ్యూటీషియన్ (3 నెలలు) వంటి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి పరీక్షలు నిర్వహించి,భారత ప్రభుత్వం ద్వారా గుర్తింపబడిన సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

ఆలయ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

మల్కాపురం: జింక్ ఆంజనేయస్వామి ఆలయం నూతన పాలకవర్గం గురువారం ప్రమాణస్వీకారం చేసింది. ఆలయ ఆవరణలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారి పాలకమండలి చైర్మన్, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడుతూ, దేవాలయ పవిత్రతకు మచ్చ రాకుండా నూతన పాలకవర్గం మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, పలు వార్డుల కార్పొరేటర్లు పి.వి.సురేష్, బల్లా లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, ఇండ్రస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుల్లె సురేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.